## మిడిల్‌క్లాస్ స్టార్

**కుటుంబస్థాన్**

**ఓటీటీ హిట్**

**జీ5 :** మార్చి 7, 2025
**తారాగణం :** మణికందన్, శాన్వీ మేఘన, ఆర్. సుందరరాజన్, ఆదన్ కుమార్, గురు సోమసుందరం తదితరులు
**దర్శకత్వం :** రాజేశ్వర్ కలిసామి


భారతదేశంలో మధ్యతరగతి వాళ్లే ఎక్కువగా కనిపిస్తారు. డబ్బు అవసరాలు, కష్టాలు, కన్నీళ్లు.. వీటితోనే జీవితాన్ని నెట్టుకొస్తుంటారు. అందుకే.. 'మిడిల్ క్లాస్' కథలతో వచ్చే సినిమాలను భారతీయులు ఓన్ చేసుకుంటారు. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తారు. అలాంటి ఓ మిడిల్ క్లాస్ ఉద్యోగి కథే.. కుటుంబస్థాన్. మిడిల్ క్లాస్ జీవితాల్లో కామన్‌గా కనిపించే ఓ సింపుల్ పాయింట్‌కు కామెడీని టచ్‌చేస్తూ.. ఈ కథను నడిపించాడు దర్శకుడు. అప్పులు చేసే కొడుకును తల్లి




దండ్రులు, ఉద్యోగం చేయని భర్తను భార్య ఎలా చూస్తుందో.. ఈ చిత్రంలో అంతర్లీనంగా చూపించాడు. కథలోకి వెళ్తే.. మధ్యతరగతి యువకుడైన నవీన్ (మణికందన్) ఓ యాడ్ ఏజెన్సీలో డిజైనర్‌గా పనిచేస్తుంటాడు. అమ్మ సుబ్బలక్ష్మి, నాన్న మూర్తితో కలిసి ఉంటాడు. అమ్మకు తీర్థయాత్రలు చేయాలని ఉంటుంది. కాబట్టి, డబ్బు అవసరం. ఇక నాన్న.. రియల్ ఎస్టేట్ అంటూ ఖాళీగా తిరుగుతుంటాడు. రూపాయి సంపాదించడు. ఇలా ఉండగా.. వెన్నెల (శాన్వీ మేఘన)ని కులాంతర వివాహం చేసుకుంటాడు నవీన్. ఆమెది తక్కువ కులమని నవీన్ కుటుంబసభ్యులు వారి ప్రేమపెళ్లిని అంగీకరించరు. మరోవైపు నవీన్ బావ రాజేంద్రన్.. అతణ్ని ఎప్పుడూ తక్కువగా చూస్తుంటాడు. దాన్ని సహించలేని నవీన్.. బావకన్నా ఉన్నతంగా ఉండాలని అనుకుంటాడు. అప్పులు చేసి బైక్, కారు తీసుకుంటాడు. తన భార్యను సివిల్స్‌కి ప్రిపేర్ చేయిస్తుంటాడు. ఇలా ఉండగా.. అనుకోని పరిస్థితుల్లో నవీన్ ఉద్యోగం ఊడిపోతుంది. ఆ విషయం ఇంట్లో చెప్పకుండా.. కుటుంబపోషణ కోసం 'లోన్ యాప్' నుంచి డబ్బులు తీసుకుంటాడు. దాన్ని తీర్చడానికి మరో అప్పు. ఇలా.. ఒకదాని కోసం మరో అప్పు చేస్తూ.. అప్పుల ఊబిలో చిక్కుకుపోతాడు. మరి ఆ అప్పులు తీర్చడానికి నవీన్ ఏం చేస్తాడు? వ్యాపారం చేయాలన్న నవీన్ కోరిక నెరవేరుతుందా? 'డబ్బే గొప్పది' అనుకుంటూ.. నవీన్‌ను చిన్నచూపు చూసే రాజేంద్రన్ కళ్లు తెరుస్తాడా? అనేది మిగతా కథ.

## అమ్మ మాటలతోనే..

తన తల్లి హేమమాలిని ఇచ్చిన ధైర్యంతోనే.. జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా, తట్టుకొని నిలబడ గలుగుతున్నానని అంటున్నది బాలీవుడ్ తార ఈశా డియోల్. బాలీవుడ్ డ్రీమ్‌గర్ల్‌గా దేశవ్యాప్తంగా సెలెబ్రిటీ అయినా.. తనను మాత్రం ఓ సాధారణ తల్లిలాగే పెంచిందనీ చెప్పుకొచ్చింది. తన కొత్తచిత్రం 'తుమ్కో మేరీ కసమ్' ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా.. ఓ జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చింది ఈశా. ఈ సందర్భంగా మహిళల జీవితానికి సంబంధించిన విషయాలను పంచుకున్నది. ''మనదేశంలో ప్రతితల్లీ తన కూతురికి ఏదో ఒక సందర్భంలో సలహాలు, సూచనలు ఇస్తుంది. అందులో ముఖ్యమైంది, తప్పకుండా చెప్పేది.. వివాహం తర్వాత కూడా అమ్మాయిలు సొంత గుర్తింపును కలిగి ఉండాలని. మా అమ్మకూడా ఇందుకు మినహాయింపు కాదు. ఆమెకూడా నాకు ఎప్పుడూ ఇదే విషయం చెప్పేది. బతకడానికి ఎవరిపైనో ఆధారపడాల్సిన అవసరంలేదనీ, ఎప్పుడూ స్వతంత్రంగా జీవించాలని చెబుతూ ఉంటుంది'' అంటూ తన తల్లి ఇచ్చిన సలహాలు, సూచనలను చెప్పుకొచ్చింది. 'ఆడవాళ్లమైనా కష్టపడి పనిచేస్తున్నాం. మనకంటూ ఒక వృత్తి, కొన్ని బాధ్యతలు ఉన్నాయి. వాటిని ఎప్పుడూ విస్మరించొద్దు. జీవితంలో గొప్పపేరు సంపాదించుకోక పోయినా.. పనిచేయడం మాత్రం ఆపవద్దు' అంటూ హేమమాలిని హితబోధ చేసేదట. ''ఇక జీవితంలో అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రేమేననీ, దాన్ని మాత్రం కోల్పోవద్దనీ మా అమ్మ అంటుండేది'' అని చెప్పుకొచ్చింది ఈశా డియోల్. బాలీవుడ్ సెలెబ్రిటీ కపుల్స్.. ధర్మేంద్ర – హేమమాలిని దంపతుల కుమార్తె ఈశా. 2002లో వచ్చిన 'కోయీ మేరే దిల్‌సే పూఛే' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. కుచ్‌తో హై, యువ, ధూమ్, కాల్, క్యాష్ లాంటి పలు విజయవంతమైన చిత్రాల్లో నటించింది. 2012లో ముంబయికి చెందిన వ్యాపారవేత్త భరత్ తఖ్తానీని పెళ్లి చేసుకున్నది ఈశా డియోల్. భర్తతో మనస్పర్ధలు తలెత్తడంతో ఇటీవలే విడాకులు తీసుకొని.. 11 ఏళ్ల వివాహ బంధానికి వీడ్కోలు పలికింది.







**గైడ్ ఇంగ్లిష్ వెర్షన్.. అమెరికాలో అస్సలు అడలేదు. హిందీ వెర్షన్... భారత్‌లో మొదట్లో ఎందుకో ఆదరణ పొందలేదు. వారాలు గడిచాయి. అమెరికా ప్రేక్షకుల్లో మార్పు రాలేదు. కానీ, మనదేశంలో రుతుపవనాల కన్నా వేగంగా 'గైడ్' పుంజుకుంది. ఆ సినిమా ఆడుతున్నచోట వర్షాలు పడుతున్నాయన్న వార్తలు వచ్చాయి. ఎంటీ గైడ్ సినిమా? ఇంగ్లిష్‌లో ఎందుకు ఫ్లాప్ అయింది? హిందీలో ఎందుకంత హిట్టయ్యింది?**

# ఆజ్ ఫిర్ జీనే కీ తమన్నా హై

**క్లాసిక్ రివైండ్ 60 years**

*తేరే దుఃఖ్ అబ్ మేరే..*
*మేరే సుఖ్ అబ్ తేరే..*
*నీ దుఃఖం నాది..*
*నా సంతోషం నీది..*
*ఇలా ఎవరైనా మాటిస్తే..*
*ఎంత భరోసాగా ఉంటుంది!*

ఆర్కే నారాయణ్ రాసిన నవల 'గైడ్' చదివిన తర్వాత.. దేవానంద్‌కు ఇలాంటి భరోసానే కుదిరింది. దానిని సినిమాగా తీయాలని అనిపించాక ఇంకా భరోసా వచ్చింది! ఇండో–అమెరికన్ కొలాబరేషన్‌లో ప్రయోగాత్మకంగా ఓ సినిమా తీయాలనుకున్నారు. ఎన్నో కథలు అనుకున్నారు. చివరికి 'గైడ్' తీయాలనుకున్నారు! అదీ ఇంగ్లిష్‌లో!! హాలీవుడ్ టీమ్ భారత్‌లో అడుగుపెట్టింది. 'గైడ్' నవలను సినిమాకు అనుకూలంగా మార్చడమూ జరిగింది. దేవానంద్‌కు ఫర్వాలేదు అనిపించింది. ఏక కాలంలో ఇంగ్లిష్, హిందీ రెండు భాషల్లో చిత్రీకరించాలని భావించారు. ఇంగ్లిష్ స్క్రిప్ట్ చూశాక దేవ్ సోదరుడు విజయ్ ఆనంద్‌కు అది అస్సలు నచ్చలేదు. 'పాశ్చాత్య ప్రేక్షకులకు అనుగుణంగా తీర్చిదిద్దిన ఈ స్క్రిప్ట్ హిందీలో తీస్తే.. నీకు చెడ్డపేరు వస్తుంది. నేను దర్శకత్వం వహించను' అని కుండబద్దలు కొట్టాడు గోల్డీ (విజయ్ ఆనంద్). మరో సోదరుడు చేతన్ ఆనంద్‌కు బాధ్యతలు అప్పగించాడు దేవ్. అన్న మాట కాదనలేక అన్యమనస్కంగానే ఓకే అన్నాడు. ఇంతలో 'భారత్–చైనా' యుద్ధం నేపథ్యంలో చేతన్ అనుకున్న ప్రాజెక్టు 'హకీకత్' షూటింగ్‌కు సైనిక అధికారుల నుంచి అనుమతులు రావడంతో 'గైడ్' నుంచి తప్పుకొన్నాడు. మధ్యలో మరో దర్శకుణ్ని అనుకున్నారు. కానీ, కుదర్లేదు. చివరికి, గోల్డీ తాను అనుకున్న మార్పులతో తీయడానికి ఒప్పుకొంటేనే దర్శకత్వం వహిస్తానన్నాడు. ఆ మార్పులు దేవ్‌కు భరోసా ఇవ్వడంతో సరే అన్నాడు. కథానాయికగా ఎందరెందరినో అనుకున్నా చివరికి వహీదా రెహమాన్ ఓకే అయింది.

**1965లో** విడుదలైన 'గైడ్' సినిమా కథలోకి వెళ్తే.. రాజు టూరిస్ట్ గైడ్. రోజి దేవదాసీ బిడ్డ. కారణాంతరాల వల్ల వయసు పైబడిన వ్యక్తిని వివాహం చేసుకుంటుంది. సంసార సుఖం ఉండదు. దాన్నంత సమస్యగా భావించదామె. కానీ, ఆమెకు నృత్యం అంటే ప్రాణం. గజ్జె కడితే ఆమె ముసలి భర్త అగ్గిమీద గుగ్గిలం అవుతుంటాడు. భార్య ఇష్టాన్ని ఖాతరు చేయడు. ఈ దంపతులు ఒకసారి రాజు గైడ్‌గా పనిచేస్తున్న పర్యాటక కేంద్రానికి వస్తారు. రాజు మంచితనం రోజీని కదిలిస్తుంది. పైకి బలవంతంగా నవ్వుతున్న ఆమె మనసులో బాధను గుర్తిస్తాడు రాజు. ఇద్దరి మధ్య స్నేహం పెరుగుతుంది. రాజు సమక్షంలో 'ఆజ్ ఫిర్ జీనే కీ తమన్నా హై.. ఆజ్ ఫిర్ మర్నే కా ఇరాదా హై' (ఈ రోజు మళ్లీ పుట్టాలన్న కోరిక పుడుతున్నది.. మళ్లీ పోవాలన్న ఉద్దేశం కలుగుతున్నది..) అంటూ ఉత్సాహంతో ఉరకలేస్తుంది. ఎందుకంటే.. చాన్నాళ్లూ పంజరంలో ఉన్న రోజి.. బయటి ప్రపంచంలోకి వచ్చిన ఆనందంలో స్వేచ్ఛగా పుట్టాలని, ఇష్టంగా పోవాలని కోరుకోవడంలో ఆశ్చర్యం ఏముంది! రోజులు గడిచే కొద్దీ... రోజి దంపతుల మధ్య దూరం పెరుగుతుంది. చివరికి భర్తతో తెగదెంపులు చేసుకొని రాజును ఆశ్రయిస్తుంది రోజి.

**'తేరే** మేరే సప్నే అబ్ ఏక్ రంగ్ హై... జహా భీ లే జాయే రహే హమ్ సంగ్ హై' 'నీ, నా స్వప్నాలు ఇప్పుడు ఒక్కటే.. ఇది ఎక్కడికి దారి తీసినా.. మనం కలిసే ఉంటాం' అని రోజీకి అభయమిస్తాడు రాజు. దీనికి కొనసాగింపుగానే 'ప్రపంచం అడ్డుపడ్డా.. మనం విడిపోము' అని కూడా హామీ ఇస్తాడు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రయత్నమూ చేస్తాడు. నృత్యంపై ఆసక్తి ఉన్న రోజీని ఎంతో ప్రోత్సహిస్తాడు. నాట్య ప్రదర్శనలు ఏర్పాటుచేసి ఆమెకు ఆకాశమంత గుర్తింపు తీసుకొస్తాడు. పేరుతోపాటు విపరీతంగా డబ్బు వస్తుంది. ఆదాయం కోసమే రాజు తనను ఆదరిస్తున్నాడన్న అపోహ ఆమెలో మెదలుతుంది. రోజి తనను అపార్థం చేసుకుంటున్నదని రాజు భావిస్తాడు. చేయని దొంగతనం అతని మీద పడుతుంది. తను నిర్దోషి అని నిరూపించుకునే అవకాశం ఉన్నా... మౌనంగా ఉండటంతో రాజుకు జైలు శిక్ష పడుతుంది. రోజులు దొర్లిపోతాయి. శిక్ష కాలానికన్నా ఆరు నెలల ముందే విడుదల అవుతాడు రాజు. మళ్లీ తన ఊరికి, తన మనుషుల మధ్యకు వెళ్లొద్దని భావిస్తాడు. ఒంటరిగా బయల్దేరుతాడు. గమ్యం లేకుండా అలా వెళ్తూనే ఉంటాడు. అలా వెళ్తూ, వెళ్తూ కరువుతో అల్లాడుతున్న ఓ గ్రామానికి చేరుకుంటాడు.

**ఇంగ్లిష్‌లో ఎందుకంత ఫ్లాప్**

> ఒకే కథ రెండు భాషల్లో సినిమా తీయడం మామూలే! కానీ, రెండు రకాలుగా తీసిన ఏకైక సినిమా 'గైడ్'. ఇంగ్లిష్ వెర్షన్ 'ద గైడ్'లో ఇంత డెప్త్ ఉండదు. రోజి, రాజు అనుబంధాన్ని ఎక్స్‌ట్రా మారిటల్ ఎఫైర్‌గా, కాస్త పరిధి దాటి చూపించడం, ఇండియన్ సంస్కృతిని గౌరవించే పాశ్చాత్యులకూ మింగుడుపడలేదు! పైగా కాస్టింగ్‌లో తేడాలు, పిక్చరైజేషన్‌లో వ్యత్యాసాలు ఇంగ్లిష్ వెర్షన్ పరాజయానికి కారణాలు అయ్యాయని సినీ పండితులు విశ్లేషిస్తారు.

**ఓ** గుడి మీద ఆకలితో, అలసటతో నిద్రలోకి జారుకున్న రాజుకు ఓ సాధువు కాషాయ వస్త్రం కప్పుతాడు. అతను నిద్ర లేచే సరికి ఆ గ్రామానికి చెందిన ఓ ఆసామి.. 'సామీ' అంటూ రాజు పాదాలపై పడతాడు. తన కూతురు పెండ్లికి ఒప్పుకోవడం లేదని మొరపెట్టుకుంటాడు. రాజు తనకు తోచిందేదో ఆ అమ్మాయికి చెబుతాడు. ఆమె తన తండ్రి చూసిన సంబంధం చేసుకోవడానికి ఒప్పుకొంటుంది. గ్రామస్తులంతా రాజు మాటలో ఏదో మహిమ ఉందని బలంగా నమ్ముతారు. అప్పట్నుంచి రాజును దైవంగా భావిస్తూ ఉంటారు. వర్షాలు లేక తమ ప్రాంతమంతా కరువు కోరల్లో చిక్కుకుపోయిందని ఓ వ్యక్తి రాజుతో చెప్పుకొంటాడు. రాజు ఎప్పటిలాగే యథాలాపంగా.. పన్నెండు రోజులు నిరాహార దీక్ష చేస్తే.. వర్షం పడుతుందని గతంలో ఎక్కడో, ఎవరికో జరిగిన అనుభవాన్ని చెబుతాడు. తమకోసం స్వామివారు ఉపవాసం పాటిస్తున్నాడని ఆ వ్యక్తి ఊరంతా ప్రచారం చేస్తాడు. ఆ ఊరు నుంచి పారిపోవాలనుకుంటాడు రాజు. కానీ, కుదరదు! చివరికి తప్పదు అనుకొని నిరాహార దీక్షకు కూర్చుంటాడు.

**రోజులు** గడుస్తుంటాయి. రాజు మనసులో సంఘర్షణ మొదలవుతుంది. వారం గడుస్తుంది. రాజును వెతుక్కుంటూ అతని తల్లి అక్కడికి వస్తుంది. అదే సమయంలో రాజు భార్య రోజి కూడా వస్తుంది. తుంచుకున్న బంధాలు మళ్లీ పంచుకునేందుకు సిద్ధంగా ఉండడు రాజు. దీక్షలోనే ఉండిపోతాడు. రోజురోజుకూ అతని ఆరోగ్యం క్షీణిస్తుంటుంది. పన్నెండో రోజు రానే వస్తుంది. ఆకలితో కన్ను మూసిన పసివాణ్ని పట్టుకొని రాజు దగ్గరికి వస్తారు భక్తులు. అన్యాయం జరిగిపోయిందని బావురుమంటారు. ఉపవాస దీక్షతో, మానసిక సంఘర్షణతో తనను తాను శుద్ధి చేసుకున్న రాజు.. 'నా ప్రాణాలు తీసుకొని ఆ పసివాణ్ని బతికించు' అని భగవంతుణ్ని ప్రార్థిస్తాడు. ఆ పసివాడు బతుకుతాడు. ఏ శక్తి లేని రాజు మహిమాన్వితుడు అయిపోతాడు. మనసులో దైవాన్ని దర్శించిన రాజు తెలియని ఆనందానికి లోనవుతాడు. గ్రామస్తులంతా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న అతని చుట్టూ చేరుతారు. ఇంతలో ఉరుములు, మెరుపులు. ఒక్కసారిగా ఆకాశానికి చిల్లు పడిందా అన్నంతగా వర్షం మొదలవుతుంది. అందరిలోనూ హర్షాతిరేకాలు! వానలో తడిసి ముద్దయిన రోజి.. రాజు దగ్గరికి వెళ్తుంది. 'రాజు.. నీ దీక్ష ఫలించింది.. చూడు ఎంత భారీగా వర్షం పడుతుందో' అని తట్టి లేపుతుంది. కానీ, రాజు కదలడు. అప్పటికే.. అతని ఆత్మ, ఆ పరమాత్మలో లీనమైపోతుంది!

**ఇంతే** 'గైడ్' సినిమా! ఇలాంటి సినిమా ఎందుకంత హిట్టయ్యింది అంటే.. ఇందులో ప్రతి సన్నివేశం హృదయాన్ని తాకుతుంది! ప్రతి మాటా మనసును తడుతుంది. ప్రతి పాటా మనోహరంగా సాగుతుంది. ఎస్.డి.బర్మన్ సంగీతం, శైలేంద్ర పాటలు 'గైడ్'ని కల్ట్ సినిమాగా మార్చేశాయి. రొమాంటిక్ హీరోగా పేరున్న దేవానంద్‌ను మరో పదిమెట్లు పైకి ఎక్కించింది 'గైడ్'. వహీదా రెహమాన్‌లోని నటనా వైచిత్రిని మరోసారి చూపించింది 'గైడ్'. విజయ్ ఆనంద్ టేకింగ్ ఏ స్థాయిలో ఉంటుందో నిరూపించింది 'గైడ్'. అందుకే అరవై ఏండ్లు పూర్తి చేసుకున్న 'గైడ్' అప్పట్లో సంచలనం. ఇప్పటికీ... అర్థం చేసుకున్నవారికి అంతులేని ఆనందాన్ని ఇస్తుంది. పనిగట్టుకొని మరీ చూడండి. మాటలు, పాటలు మనసుతో ఆలకించండి. హృదయంలో పరివర్తన వస్తుంది, మస్తిష్కంలో పరిశోధన మొదలవుతుంది.

... కణ్వస

**అన్ని పాటలూ హిట్టే..**

> 'గాతా రహే మేరా దిల్'
> 'తేరే మేరే సప్నే..'
> 'దిల్ ఢల్ జాయే హాయ్..'
> 'పియా తోసే నైనా లాగే రే..'
> 'వహా కౌన్ హై తేరా ముసాఫిర్'
> 'ఆజ్ ఫిర్ జీనే కీ తమన్నా హై..'
> ఇలా గైడ్ పాటలన్నీ ఎవర్‌గ్రీన్ లిస్ట్‌లో చోటు దక్కించుకొని ఇప్పటికీ శ్రోతలను అలరిస్తూనే ఉన్నాయి.

## శ్రద్ధా.. చెట్టపట్టాల్!

తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అక్కర్లేని బాలీవుడ్ బ్యూటీ.. శ్రద్ధా కపూర్. బీటౌన్‌లో విలక్షణ ప్రతినాయకుడిగా పేరు తెచ్చుకున్న శక్తి కపూర్ కుమార్తెగా.. ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. 'సాహో'లో ప్రభాస్ సరసన మెరిసింది. అయితే, ప్రస్తుతం ఈ అమ్మడు.. స్క్రీన్‌ప్లే రైటర్, అసిస్టెంట్ డైరెక్టర్ రాహుల్ మోడీతో పీకల్లోతు ప్రేమలో ఉన్నదంటూ సోషల్ మీడియా కోడై కూస్తున్నది. చెట్టపట్టాలేసుకొని తిరుగుతున్న ఈ జంట.. అడపాదడపా కెమెరా కళ్లకు చిక్కుతూ ఆ వాదనలకు మరింత బలాన్ని ఇస్తున్నది. అంబానీల ఇంట పెళ్లి వేడుక మొదలుకొని.. సన్నిహితుల వివాహ సంబురాల్లోనూ ఈ జంట అనేకసార్లు దర్శనమిచ్చింది. సినిమా ఈవెంట్లలోనూ రాహుల్ మోడీతో కనిపించింది. దాంతో.. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని బీటౌన్‌లో తరచుగా టాక్ వినిపిస్తూనే ఉన్నది. తాజాగా, శ్రద్ధా కపూర్ – రాహుల్ మోడీ కలిసి ఉన్న ఓ వీడియో.. సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతున్నది. ఈ చిన్న వీడియో క్లిప్‌లో రాహుల్‌ను గట్టిగా హత్తుకుని, వీడ్కోలు చెబుతున్నది శ్రద్ధా కపూర్. అయితే, ఈ వీడియోను చూసినవాళ్లంతా.. వాళ్లిద్దరూ ప్రేమలో ఉన్నారనీ, త్వరలోనే పెళ్లి బాజాలు మోగనున్నాయనీ అంటున్నారు. వైరల్ అవుతున్న సదరు వీడియో కింద పెళ్లి గురించే కామెంట్ల మీద కామెంట్లు పెడుతున్నారు. ఇక శ్రద్ధా కపూర్ సినిమాల విషయానికి వస్తే.. గతేడాది వచ్చిన 'స్త్రీ2'తో అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.800 కోట్లకు పైగా కొల్లగొట్టడంతో శ్రద్ధా ఒక్కసారిగా టాప్ హీరోయిన్ల జాబితాలో చేరిపోయింది. ప్రస్తుతం 'స్త్రీ3'తోపాటు హృతిక్ రోషన్‌తో క్రిష్ 4, రణ్‌బీర్ కపూర్‌తో ధూమ్ 4 లాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉన్నది.



## పురుషాధిక్య ప్రాంగణం..

బాలీవుడ్‌ను పురుషాధిక్యత కలిగిన ప్రాంతంగా అభివర్ణిస్తున్నది సీనియర్ నటి దివ్య దత్తా. వినోదరంగంలో లింగ అసమానత రోజురోజుకూ పెరిగిపోతున్నదని ఆమె ఆందోళన వ్యక్తంచేస్తున్నది. తాజాగా, దివ్య ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. పరిశ్రమ ఇంకా పురుషాధిక్యతలోనే ఉన్నదనీ, నిజమైన సమానత్వాన్ని సాధించడానికి ఇంకా చాలాదూరం వెళ్లాల్సి ఉన్నదని చెప్పుకొచ్చింది. చారిత్రక చిత్రాలలో మహిళల ప్రాతినిధ్యం గురించి మాట్లాడుతూ.. ''కథలు, చారిత్రక పాత్రల్లో మహిళల విషయానికి వస్తే.. అవన్నీ కథనం పైనే ఆధారపడి ఉంటాయి. మీరు రాణి లక్ష్మీబాయి, ఇందిరా గాంధీ గురించి చెప్పాలనుకుంటే.. ఆ సినిమాలకు వాళ్లే కీలకపాత్రలు అవుతారు. అదే, మహారాజ్ శంభాజీ కథ అయితే.. అందరి దృష్టీ అతనిపైనే ఉంటుంది. ఇక్కడ 'ఎవరి కథ చెబుతున్నాం?' అనేదానిపైనే అన్నీ ఆధారపడి ఉంటాయి. ఇక పీరియాడికల్ డ్రామాల్లో బలమైన మహిళా పాత్రలు ఉన్నప్పటికీ, వాటిని సమర్థంగా పోషించడానికి ఎన్నో సవాళ్లను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది'' అంటూ తన అభి



ప్రాయాలను పంచుకున్నది ఈ సీనియర్ నటి. తన తాజా ప్రాజెక్ట్ ఛావా గురించి మాట్లాడుతూ.. ''రాజమాత సోయరాబాయి పాత్రకోసం నన్ను సంప్రదించినప్పుడు ఎంతో ఎగ్జయిట్ అయ్యాను. ఆ పాత్రకు సంబంధించిన స్కెచ్‌లు, చారిత్రక కథనాలను కూడా అందించారు. దాంతో సులభంగానే ఆ పాత్రలో లీనమయ్యాను. సెట్లు, దుస్తులు, సంభాషణలు.. అన్నీ చాలాబాగా కుదిరాయి. దాంతో.. నిజంగా ఆ కాలంలోకి వెళ్లినట్టు అనిపించింది. ఇలాంటి చారిత్రక చిత్రంలో పనిచేయడం నాకు ఇదే మొదటిసారి. ఇదో అందమైన అనుభవం కూడా!'' అంటూ 'ఛావా'పై ప్రశంసలు కురిపించింది. 1994లో 'ఇష్క్‌మే జీనా – ఇష్క్‌మే మర్నా' చిత్రంతో నటనారంగ ప్రవేశం చేసింది దివ్య దత్తా. తన బహుముఖ ప్రజ్ఞతో.. పరిశ్రమలోని అత్యుత్తమ నటీమణులలో ఒకరిగా ఎదిగింది. అనేక విజయవంతమైన చిత్రాలు, టెలివిజన్ కార్యక్రమాలు, వెబ్ సిరీస్‌లలో పనిచేసి.. బాలీవుడ్‌పై చెరగని ముద్ర వేసింది. 30 ఏళ్ల తన కెరీర్‌లో అనేక ప్రశంసలు, అవార్డులూ అందుకున్నది.